RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక




హైదరాబాద్ | శుక్రవారం 5-6-2026 | సంచిక: 13 | సంఖ్య: 249 పేజీలు: 4 | వేలు: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి

# భూసేకరణ తర్వాతే ప్రాజెక్టుల నిర్మాణం పనులు

### భూసేకరణ, పునరావాసానికే తొలుత నిధుల కేటాయింపు

### యుద్ధప్రాతిపదికన భూసేకరణ పూర్తి చేయాల్సిన బాధ్యత కలెక్టర్లదే..

**ప్రాజెక్టులకు నిధుల కొరత లేకుండా చూసుకుంటాం..**

**మంత్రులు.. ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, అధికారులతో సమన్వయం చేసుకోవాలి..**


**ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టుల పురోగతిపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష**

**తొలిరోజు వడివడిగా ప్రాజెక్టుల సందర్శన.. నేడు జడ్చర్ల సమీపంలో బహిరంగసభ**



హైదరాబాద్: పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 6 నెలల్లో కర్వెన రిజర్వాయర్ వరకు నీరందించాలని చెప్పారు. దీంతోపాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఇతర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణను సత్వరంగా పూర్తి చేసేందుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు స్పష్టంచేశారు. ప్రధాన భూసేకరణను వేగవంతం చేయాలని, ఈ బాధ్యతను కలెక్టర్లు తీసుకోవాలని సూచించారు. భూసేకరణ పూర్తయిన తర్వాతే ప్రాజెక్టుల నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు చెప్పారు. గురువారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిలలోని మృగవాణి రిసార్ట్‌లో అధికారులతో రేవంత్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

2లో



## ఏపీ రాజ్యసభ సీట్ల పంపకం పూర్తి..

# టీడీపీకి 3, జనసేనకు 1

**రాజ్యసభ సీట్ల పంపకాలపై కొలిక్కి వచ్చిన ఫార్ములా**

**టీడీపీకి మూడు, జనసేనకు ఒక స్థానం కేటాయింపు**

**ఈసారి బీజేపీకి దక్కని రాజ్యసభ అవకాశం**

**సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరిగిన సమావేశంలో తుది నిర్ణయం**

**జూన్ 18న నాలుగు స్థానాలకు జరగనున్న పోలింగ్**

ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు రాజ్యసభ స్థానాలకు సంబంధించి అధికార ఎన్డీఏ కూటమిలో సీట్ల పంపకం ఖరారైంది. కూటమిలోని ప్రధాన పార్టీ అయిన తెలుగుదేశం పార్టీ (టీడీపీ) మూడు స్థానాలను తీసుకోనుండగా, జనసేన పార్టీకి ఒక స్థానాన్ని కేటాయించారు. ఈ సర్దుబాటులో బీజేపీకి ఈసారి అవకాశం లభించలేదు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన కీలక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ భేటీలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్ పాల్గొన్నారు. ఈ భేటీలో మిత్రపక్ష నేతలతో చర్చించిన అనంతరం, సీట్ల కేటాయింపు నిర్ణయాన్ని సీఎం స్వయంగా వెల్లడించారు. మూడు పార్టీల నేతల ఏకాభిప్రాయంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. త్వరలోనే

## భూముల విలువ పెంపు

### రిజిస్ట్రేషన్ ఆఫీసులకు పోటెత్తిన జనం

- తెలంగాణ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద భారీ రద్దీ
- భూముల మార్కెట్ విలువలు, ఛార్జీల పెంపు నేపథ్యంలో జనం పరుగులు
- రద్దీని దృష్టిలో ఉంచుకొని పనివేళలు పొడిగించిన ప్రభుత్వం
- రాత్రి 7:30 గంటల వరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు అనుమతి

2లో

## పవన్ సభకు అనుమతి ఎందుకు ఇవ్వలేదు?

- తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామ్‌చందర్ రావు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని ఎద్దేవా
- ఎవరైనా, ఎక్కడైనా సభ పెట్టుకునే హక్కు ఉందని వ్యాఖ్య
- రాజకీయ పరిస్థితులను బట్టి తెలంగాణలో పొత్తు ఉంటుందని వివరణ
- జనసేనతో పొత్తుపై హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందని వెల్లడి

## కేరళను తాకిని నైరుతి రుతుపవనం

### మరో వారం రోజుల్లో తెలంగాణకు రాక



తిరువనంతపురం,జూన్4: ఇంతకాలం మండుటెండలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఉపశమనం కలిగించేలా చల్లని కబురు వచ్చేసింది. కేరళకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. దాంతో కేరళ తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

2లో



# అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

### కేఎస్సార్ ఫ్యాషన్స్ దుకాణంలో మంటలు

- ఆస్తి, ప్రాణనష్టంపై అందని వివరాలు
- రంగంలోకి దిగిన ఫైర్ ఇంజన్లు, పోలీసులు
- అమీర్‌పేట-ఎస్సార్ నగర్ మధ్య ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

**హైదరాబాద్:** హైదరాబాద్ అమీర్‌పేటలో గురువారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. శ్రీనివాసనగర్ వెస్ట్‌లో, మెట్రో పిల్లర్ నంబర్ - 1043 సమీపంలో ఉన్న కేఎస్సార్ ఫ్యాషన్స్ దుకాణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదం కారణంగా మంటలు భారీగా ఎగసిపడ్డాయి. దీంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. అగ్నిప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. మంటలు వేగంగా వ్యాపించకుండా ఉండేందుకు

2లో

# తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం

### ఉద్యమకారుల సంఘాలను కలిసి వివరాలు సేకరిస్తాం

### అఖిలపక్ష భేటీలో కమిటీ ఛైర్మన్ కేశవరావు

హైదరాబాద్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ప్రత్యక్షంగా.. పరోక్షంగా పాల్గొన్న ఉద్యమకారులందరికి న్యాయం చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని కె. కేశవరావు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం కె. కేశవరావు అధ్యక్షతన




2లో

2లో



## రాష్ట్రంలో తగ్గని ఎండల తీవ్రత

### అంగన్‌వాడీ కేంద్రాలకు 14 వరకు సెలవులు

15న తిరిగి

## తృణమూల్‌కు వరుస ఎదురుదెబ్బలు

- అసెంబ్లీ తరహాలో పార్లమెంటులోనూ తిరుగబాటు
- తాజా రాజకీయాలపై జాతీయ మీడియాలో కథనాలు
- బిధ్నానగర్ మేయర్ కృష్ణాచక్రవర్తి రాజీనామా

కోల్‌కతా,జూన్4: పశ్చిమ బెంగాల్‌లో అధికారం కోల్పోయిన మమతా బెనర్జీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి.



# సీఎం బామ్మర్దిది రూ.15 వేల కోట్ల కుంభకోణం

### మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపణ

- బొగ్గు స్కాం బయటపెట్టామని మాపై కక్ష
- బాల్క సుమన్‌తో జైల్లో ములాఖత్

చంచల్‌గూడ: సీఎం రేవంత్‌రెడ్డి బామ్మర్ది సృజన్‌రెడ్డి రూ.15 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# భూసేకరణ తర్వాతే ప్రాజెక్టుల నిర్మాణం పనులు

పాలమూరు ఎత్తిపోతల పథకం కింద పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి వేగంగా పూర్తిచేయాలని సీఎం చెప్పారు. నార్లాపూర్, ఏదుల, కరివెన రిజర్వాయర్ల నిర్మాణం పూర్తికాగా, వీటి లింకేజీకి సంబంధించి పెండింగ్ పనులను పూర్తిచేయాలన్నారు. వీటికి నిధుల కొరత లేకుండా ప్రభుత్వం చూసుకుంటుందని చెప్పారు. నెలవారీగా ప్రాజెక్టు పనులను పూర్తిచేసేందుకు అవసరమైన నిధుల వివరాలను ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. తక్కువ నిధులతో పూర్తయ్యే పనులను వేగంగా పూర్తిచేయాలన్నారు. ఆరు నెలల్లోగా కరివెన రిజర్వాయర్ వరకు నీళ్లు అందించే లక్ష్యంగా పనులు వేగవంతం చేయాలని చెప్పారు. మరో 15 రోజుల తర్వాత ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్షిస్తానన్నారు. ఎప్పటికప్పుడు ఇంజినీరింగ్ అధికారులు సంబంధిత మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

తొలి రోజు చకచకా..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన తొలి రోజు గురువారం చకచకా సాగింది. కర్ణాటక రాష్ట్ర చిన్న నీటి పారుదల శాఖ మంత్రి బోసురాజు, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో కలిసి పలు ప్రాజెక్టులను సందర్శించారు. కొడంగల్-- నారాయణపేట-- మక్తల్ ఎత్తిపోతలు, గుడ్డెందొడ్డి పంప్‌హౌస్ పనుల ప్రగతిపై స్వయంగా ఆరా తీశారు. కోయిల్‌సాగర్, కృష్ణా, భీమా నదులపై రోడ్ కం బరాజ్‌ల ప్రతిపాదిత స్థలం, జూరాల డ్యామ్‌ను ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. రాత్రి 10 గంటల వరకు సమీక్ష నిర్వహించిన అనంతరం సోమశిలలోని మృగవాణి రిసార్ట్‌లో రేవంత్‌రెడ్డి బస చేశారు. శుక్రవారం పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతలు, ఎంజీకేఎల్ఐలో భాగమైన పలు రిజర్వాయర్లు, పంప్‌హౌస్ పనులను పరిశీలించనున్నారు. సాయంత్రం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలోని గంగాపూర్ రోడ్‌లో ఉన్న మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడనున్నారు.

**హామీల అమలుకు కట్టుబడి...**

మక్తల్-- నారాయణపేట-- కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూనే నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, నీటిపారుదల రంగాన్ని మరింత బలోపేతం చేసి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు. పాలమూరు-- రంగారెడ్డి ప్రాజెక్టు ప్యాకేజీల వారీగా పురోగతిపై రేవంత్‌రెడ్డి ఒక్కో ప్యాకేజీలో పెండింగ్ పనులకు గత కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నార్లాపూర్ రిజర్వాయర్ పనులు నూరు శాతం పూర్తికాగా, ఏదుల రిజర్వాయర్ పనులు 95 శాతం పూర్తయ్యాయని అధికారులు వెల్లడించారు. వట్టెం రిజర్వాయర్ కట్ట పనులు పూర్తికాగా, ప్రస్తుతం కాంక్రీట్, రివిట్‌మెంట్ పనులు కొనసాగుతున్నాయన్నారు. గడువులోగా పనులు పూర్తిచేసేందుకు అవసరమైన నిధుల అంచనాలను త్వరగా అందించాలని అధికారులను ఆదేశించారు.

# ఏపీ రాజ్యసభ సీట్ల పంపకం పూర్తి.. టీడీపీకి 3, జనసేనకు 1

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యసభ అభ్యర్థుల పేర్లను అధికారికంగా ప్రకటిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో ఉన్న సంఖ్యా బలం ఆధారంగానే ఈ కేటాయింపులు జరిపినట్లు స్పష్టమవుతోంది. అసెంబ్లీలో టీడీపీకి భారీ మెజారిటీ ఉండగా, జనసేనకు 21 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం జూన్ 18న నాలుగు రాజ్యసభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ప్రస్తుతం వైసీపీకి చెందిన మూడు, టీడీపీకి చెందిన ఒక స్థానం ఖాళీ అవుతున్నాయి. అసెంబ్లీలో ఎన్డీఏ కూటమికి ఉన్న పూర్తి ఆధిక్యతతో ఈ నాలుగు స్థానాలనూ గెలుచుకోవడం లాంఛనప్రాయమే. కాగా, నేటి ఎన్డీయే సమావేశంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు మూడు ప్రాంతాల్లో బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా జూన్ 9న తిరుపతిలో 'సంక్షేమం', 12న అమరావతిలో 'సుపరిపాలన', 15న విశాఖపట్నంలో 'అభివృద్ధి' అనే అంశాలపై సభలు జరపాలని చంద్రబాబు సూచించారు.

## అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

పరిసర ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. భవనంలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు కూడా కొనసాగాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. అగ్నిప్రమాదంలో ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం ఎంత మేరకు జరిగిందనే విషయంపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అగ్నిప్రమాదం కారణంగా అమీర్‌పేట నుంచి ఎస్సార్ నగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో పరిసర ప్రాంతాల్లో భారీ ట్రాఫిక్ జామ్ నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఇతర మార్గాల వైపు మళ్లిస్తూ పరిస్థితిని నియంత్రించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు, వాహనదారులు అమీర్‌పేట- ఎస్సార్‌నగర్ మార్గాన్ని తాత్కాలికంగా నివారించి ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని అధికారులు సూచించారు. అలాగే విధుల్లో ఉన్న ట్రాఫిక్, అగ్నిమాపక సిబ్బంది, ఇతర అత్యవసర సేవల సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం వివరాలు అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.

## సీఎం బామ్మర్దిది రూ.15 వేల కోట్ల కుంభకోణం

(మొదటి పేజీ తరువాయి)

వివాదాస్పద వ్యాఖ్యల కేసులో జైల్లో ఉన్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను ఆయన గురువారం చంచల్‌గూడ జైల్లో ప్రత్యేక ములాఖత్‌లో కలిశారు. అనంతరం జైలు బయట మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ సింగరేణి బొగ్గు కుంభకోణం బయటపెట్టినందుకే బీఆర్ఎస్ నాయకులపై ప్రభుత్వం కక్షగట్టిందన్నారు. సోలార్ టెండర్ల అంశం, నైనీ బొగ్గు టెండర్ల అవకతవకలను మాజీమంత్రి హరీశ్‌రావు వెలుగులోకి తెచ్చారని చెప్పారు. సింగరేణిలో ఉద్యోగ నియామకాలపై విజిలెన్స్ విచారణ చేపిస్తామన్న భట్టి విక్రమార్క వ్యాఖ్యలతో కార్మికులు కలత చెందారన్నారు. కుంభకోణాలను కప్పిపుచ్చేందుకే సుమన్‌ను జైల్లో పెట్టారని చెప్పారు. బాంబులు పెట్టి సీఎం అధికారిక భవనం ప్రగతి భవన్‌ను లేపేస్తామని గతంలో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ ఆయనపై చర్యలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కూడా పాతబస్తీలో సర్జికల్ స్ట్రైక్ చేస్తామన్నారని, అది కూడా శిక్షార్హమేనన్నారు. హరీశ్‌రావుపై పెట్రోల్ పోసి తగులబెడతానని మైనంపల్లి హనుమంతరావు చేసిన వ్యాఖ్యలు గుర్తు చేశురు. ఇతరులకో న్యాయం, బీఆర్ఎస్ పార్టీ నాయకులకో న్యాయం జరుగుతుందన్నారు. ఉద్యమ సమయంలో సుమన్‌పై 220 కేసులు పెట్టారని, ఇప్పుడు ఇంకా అక్రమ కేసులు పెట్టి రికార్డు బ్రేక్ చేసేలా ఉన్నారని చెప్పారు. తీయని 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గును తీసినట్టు అవకతవకలకు పాల్పడి రూ.1,600 కోట్ల గోల్‌మాల్‌కు తెరలేపారన్నారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌యాదవ్, సుధీర్‌రెడ్డి ఉన్నారు.

**పాతబస్తీలో సందడి చేసిన కేటీఆర్..**

చార్మినార్ (హైదరాబాద్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ గురువారం పాతబస్తీలో పర్యటించారు. చంచల్‌గూడ జైల్లో తమ పార్టీ నాయకుడు బాల్క సుమన్‌ను పరామర్శించిన అనంతరం ఆయన నేరుగా చార్మినార్ వద్దకు చేరుకున్నారు. బీఆర్ఎస్ నాయకుడు అలీ మస్కతీ తదితరులతో కలిసి అక్కడి నిమ్రా కేఫ్‌లో ఉస్మానియా బిస్కెట్లు తిని ఇరానీ చాయ్ తాగారు. తర్వాత ఆయన చార్మినార్ వద్ద పర్యాటకులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం కార్యకర్తలు, నాయకులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు.

## తృణమూల్‌కు వరుస ఎదురుదెబ్బలు

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ తరలహాలోనే టీఎంసీ ఎంపీలు కూడా తిరుగుబాటు బావుటా ఎగరవేయనున్నారనే వార్తలు ప్రచారం అవుతున్నాయి. టీఎంసీకి చెందిన సుమారు 20 మంది ఎంపీలు తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇప్పటికే ఈ ఎంపీలు బీజేపీతో టచ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై ఉన్నతస్థాయిలో చర్చలు కూడా జరుగుతున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. తృణమూల్‌కు లోక్‌సభలో 28 మంది ఎంపీలు, రాజ్యసభలో 13 మంది ఎంపీలు ఉన్నారు. పార్లమెంటులో ఎంపీల సంఖ్యాపరంగా టీఎంసీ రెండో అతిపెద్ద ప్రతిపక్ష పార్టీగా ఉంది. ఈ నేపథ్యంలో పార్లమెంటు వేదికగా టీఎంసీ చీలిపోతే పార్లమెంటులో ప్రతిపక్షం ప్రభావం గణీయంగా తగ్గుతుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇటీవల పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో కనిపించిన సీన్ రాబోయే కొన్ని రోజుల్లో పార్లమెంటులో కూడా కనిపిస్తుందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. టీఎంసీ రెబల్ వర్గం బలం మరింత పెరుగుతుందని అంటున్నారు. ప్రస్తుతం తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ తమ పార్టీ ఎన్నికల గుర్తు, పార్టీ పేరును కాపాడుకునే పనిలో నిమగ్నమైనట్టు మీడియాలో వార్తలు వెలువడ్డాయి. టీఎంసీకి రాష్ట్రంలో 80 ఎమ్మెల్యేలు ఉండగా రుతువ్రత బెనర్జీ నేతృత్వంలో 58 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు బావుటా ఎగరేసిన విషయం తెలిసిందే. అసెంబ్లీలో తామే అసలైన టీఎంసీ అని రుతువ్రత స్పష్టం చేయడంతో ఆయనకు ప్రతిపక్ష నేత హోదా దక్కింది. పశ్చిమబెంగాల్‌లో ఓటమి తరువాత టీఎంసీలో విభేదాలు పెరిగాయి. రాష్ట్రంలో అవినీతి, ఆర్‌జీ కార్ ఆసుపత్రి హత్యాచారం కేసులో ప్రభుత్వ తీరును సొంత పార్టీ నేతలే విమర్శించారని సమాచారం. పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. బిధాన్నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కృష్ణా చక్రవర్తి.. గురువారం తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారామె.

## తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం

ఏర్పాటైన కమిటీతో గురువారం హైదరాబాద్ సచివాలయంలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం కేకే మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉద్యమకారుల సంఘాలను మళ్లీ కలుస్తామని అన్నారు. అందుకోసం ఉద్యమకారులందరినీ పిలిచి మాట్లాడతామని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని వివరించారు. ఈ అఖిల పక్షం సమావేశంలో అన్ని పార్టీల నేతలు పాల్గొన్నారని చెప్పారు. విద్యార్థులతో, ఉద్యమకారుల సంఘాలతో అనుబంధం ఉన్న వారిని మళ్లీ కలుస్తామని కె.కేశవరావు తెలిపారు. ఉద్యమకారులందరిని పిలిచి మాట్లాడుతామన్నారు. తెలంగాణ తొలి దశతోపాటు మలి దశ ఉద్యమకారులందరికీ న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేసేందుకు రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలంగాణ రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఉద్యమకారులందరితోనూ మాట్లాడతామన్నారు. నష్టపోయిన అందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. ఈ ప్రజా పాలన ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించడానికి ఏర్పాటు చేసిన కమిటీ.. అఖిలపక్ష పార్టీల నుంచి ఇద్దరి చొప్పున పిలిచామని పేర్కొన్నారు. పార్టీలు మాత్రమే కాకుండా ఉద్యోగ, విద్యార్థి, జర్నలిస్ట్, న్యాయవాదులు అందరినీ పిలిచి మాట్లాడతామని వివరించారు. కవులు, కళాకారులు తెలంగాణ సాధన కోసం పని చేసిన అందరిని గుర్తిస్తామన్నారు. ఈ పక్రియ అమరవీరుల ద్వీపంలో ప్రారంభమవుతుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు గౌరవం ఇవ్వాలని, వారిని గుర్తించాలని, అలాగే అందరి నుంచి సూచనలు స్వీకరించాలని నిర్ణయించామన్నారు. రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విజ్ఞప్తులు స్వీకరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు.



## భూముల విలువ పెంపు

తెలంగాణలో భూముల మార్కెట్ విలువలు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్నాయనే వార్తల నేపథ్యంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు జనంతో కిటకిటలాడాయి. పాత ధరలకే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకునేందుకు గురువారం ఉదయం నుంచే ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 4న రాత్రి 7:30 గంటల వరకు పనివేళలను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న వాస్తవ ధరలకు, అధికారిక రిజిస్ట్రేషన్ విలువలకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించడం ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇది రేపటి నుంచి అమలులోకి వస్తుండటంతో, పెరిగే ఛార్జీల భారం నుంచి తప్పించుకునేందుకు కొనుగోలుదారులు కార్యాలయాల వద్ద బారులు తీరారు. ప్రజల రద్దీ, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న రెవెన్యూ శాఖ, ప్రత్యేకంగా గురువారం పనివేళలను పొడిగించింది. టోకెన్లు తీసుకున్న వారందరి రిజిస్ట్రేషన్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. ప్రభుత్వం పనివేళలు పొడిగించి సౌలభ్యం కల్పించినా, భారీ సంఖ్యలో జనం రావడంతో వ్యవస్థపై ఒత్తిడి నెలకొంది.

## పవన్ సభకు అనుమతి ఎందుకు ఇవ్వలేదు?



తెలంగాణలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ సభ పెడతానంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు విమర్శించారు. ప్రజాస్వామ్య దేశంలో ఎవరైనా, ఎక్కడైనా సభ పెట్టుకునే హక్కు ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జనసేన సభకు ఎందుకు అనుమతి ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఉద్దేశపూర్వకంగానే మళ్లీ తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టాలని చూస్తున్నాయని ఆరోపించారు. ఈ రెండు పార్టీలను ప్రజలు పూర్తిగా తిరస్కరించే పరిస్థితి వచ్చిందని అన్నారు. అందుకే తమ ఉనికిని కాపాడుకోవడానికే మళ్లీ ప్రాంతీయ సెంటిమెంట్‌ను వాడుకుంటున్నాయని మండిపడ్డారు. గతంలో ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించిన ఎంఐఎంతో బీఆర్ఎస్ కలిసి పనిచేయలేదా? అని ఆయన నిలదీశారు. అది తెలంగాణ వ్యతిరేక శక్తులతో పనిచేసినట్లు అవ్వదా? అంటూ ప్రశ్నించారు. రాజకీయ పరిస్థితులను బట్టి తెలంగాణలో పొత్తుపై ముందుకెళ్తామని రామచందర్ రావు స్పష్టం చేశారు. జనసేనతో పొత్తుపై పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు.

## కేరళను తాకిని నైరుతి రుతుపవనం

ఇక అక్కడ ఇనుంచి తమిళనాడు, కర్నాటక,ఆంధ్రాలకు విస్తరిస్తాయి. మరో వారంలోపే ఈ రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉంది. అయితే గతంతో పోలిస్తే ఈసారి నైరుతి రుతుపవనాలు కొంత ఆలస్యంగా వచ్చాయి. వాస్తవానికి మే 26వ తేదీననే నైరుతి రుతపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ముందుగా అంచనా వేసింది. కానీ, ఎల్‌నినో ప్రభావంతో ఆ అంచనాలు తలకిందుల య్యాయి. కాగా రుతుపవనాల ప్రభావంతో ఇప్పటికే కేరళలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలప్పుళ, కొట్టాయం, ఎర్నాకుళం జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో అటు తమిళనాడులోని 15 జిల్లాల్లోనూ రానున్న కొన్ని గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరిక జారీచేసింది. ఇదిలావుంటే.. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది నైరుతి రుతుపవన కాలంలో (జూన్-సెప్టెంబర్) సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదవుతుందని వాతావరణ విభాగం అంచనా వేసింది. దీర్ఘకాల సగటుతో పోలిస్తే 90శాతం వర్షమే ఈ సీజన్‌లో కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నది. పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఎల్‌నినో పరిస్థితులు ఆవిర్భవిస్తున్నాయని, జూన్‌లో ఇవి బలహీనంగా ఉన్నా సెప్టెంబర్‌లో మాత్రం బలంగా ఉండే అవకాశం ఉందని తెలిపింది.

## రాష్ట్రంలో తగ్గని ఎండల తీవ్రత

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: రాష్ట్రంలో భానుడి భగభగలకు జనం అల్లాడిపోతున్నారు. మునుపెన్నడూ లేని విధంగా మే నెల ముగిసినా ఎండల తీవ్రత, వడగాల్పుల ప్రభావం ఏమాత్రం తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో చిన్న పిల్లలు, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులను పొడిగించింది. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓఝు వేసవి సెలవులను జూన్ 13 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 14వ తేదీన ఆదివారం కావునా.. జూన్ 15 నుండి ఈ కేంద్రాలు యథావిధిగా తిరిగి పనిచేయడం ప్రారంభిస్తాయి. నిజానికి ముందస్తు ప్రణాళిక ప్రకారం జూన్ 2వ తేదీ నుంచే అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలలను పునఃప్రారంభించాలని ప్రభుత్వం భావించింది. అయితే, జూన్ మొదటి వారంలో కూడా ఉష్ణోగ్రతలు 40 నుండి 45 డిగ్రీల సెల్సియస్ దాటుతుండటం, మధ్యాహ్నం వేళల్లో తీవ్రమైన ఉష్ణగాలులు వీస్తుండటంతో తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. చిన్న పిల్లలు ఎండ దెబ్బకు గురయ్యే ప్రమాదం ఉండటంతో ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సైతం ఎండల తీవ్రత కారణంగా వేసవి సెలవులను పొడిగించిన సంగతి తెలిసిందే. పాఠశాలల మాదిరిగానే అంగన్‌వాడీ కేంద్రాలను కూడా జూన్ 14 వరకు మూసి ఉంచాలని, విద్యాసంస్థలతో పాటే జూన్ 15న ఒకేసారి తెరవాలని ప్రభుత్వం భావిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వారు 3 నుండి 6 సంవత్సరాల లోపు పిల్లలు కావడంతో వారికి రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఇలాంటి వాతావరణంలో వారు బయటకు వస్తే వడదెబ్బ తగిలి డీహైడ్రేషన్, జ్వరం బారిన పడే అవకాశం ఉంది. అందుకే వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో ప్రభుత్వం ఈ పొడిగింపు నిర్ణయం తీసుకుంది.



## ఏపీ, తెలంగాణకు కేంద్రం గుడ్‌న్యూస్.. కొత్త ఎయిర్‌పోర్ట్‌లకు గ్రీన్ సిగ్నల్!

తెలుగు రాష్ట్రాల్లో విమానయాన రంగానికి ఊతమిచ్చే కీలక నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకుంది. ప్రాంతీయ కనెక్టివిటీని మరింత మెరుగుపర్చే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో పల్లెలు, చిన్న పట్టణాలకు కూడా విమాన ప్రయాణ సౌకర్యం మరింత చేరువ కానుంది.కేంద్ర పౌర విమానయాన శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా నాగార్జునసాగర్ సమీపంలో కొత్త ఎయిర్‌పోర్ట్‌ను నిర్మించనున్నారు. ఇదే సమయంలో తెలంగాణలో వెనుకబడిన ప్రాంతంగా భావించే ఆదిలాబాద్‌కు కూడా విమానాశ్రయాన్ని మంజూరు చేశారు. ఈ రెండు ప్రాంతాల్లో విమాన సౌకర్యాలు అందుబాటులోకి రావడం వల్ల రవాణా వ్యవస్థలో గణనీయమైన మార్పులు చోటుచేసుకోనున్నాయి.చిన్న పట్టణాలను దేశవ్యాప్తంగా విమాన మార్గాలతో అనుసంధానించే 'ఉడాన్ 2.0' పథకంలో భాగంగా ఈ ప్రాజెక్టులు అమలుకానున్నాయి. ఈ పథకం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.28 వేల కోట్ల భారీ నిధులను కేటాయించగా, అందులో రూ.12 వేల కోట్లు కొత్త విమానాశ్రయాల నిర్మాణానికే వెచ్చించనుంది. ఆదిలాబాద్‌లో ఇప్పటికే ఉన్న ఎయిర్‌ఫోర్స్ రన్‌వేకు అనుబంధంగా పౌర విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసే ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.కొత్త ఎయిర్‌పోర్టుల ఏర్పాటు వల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. లాజిస్టిక్స్, రవాణా, పర్యాటక రంగాలతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి కూడా ఇవి దోహదం చేయనున్నాయి. దీంతో ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి లభించే అవకాశం ఉంది.ఇక తెలంగాణలోని మామునూరు విమానాశ్రయం ప్రాజెక్టు తుది దశకు చేరుకోగా, త్వరలోనే శంకుస్థాపన జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే కొత్తగూడెం, బసంత్‌నగర్ ప్రాంతాల్లో భూకేటాయింపులు పూర్తయితే అక్కడ కూడా విమానాశ్రయాల అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో భోగాపురం, గన్నవరం విమానాశ్రయాల విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి.కొత్త విమానాశ్రయాల ఏర్పాటు ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ప్రాంతీయ కనెక్టివిటీ పెరగడంతో పాటు అభివృద్ధికి కొత్త మార్గాలు తెరుచుకోనున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## చంచల్‌గూడ జైల్లో బాల్క సుమన్‌ను కలిసిన కేటీఆర్

**సింగరేణి ఆస్తులను ధ్వంసం చేయాలంటూ బాల్క సుమన్ వ్యాఖ్యలు**

**చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న సుమన్**

**కేటీఆర్‌తో పాటు జైలుకు వెళ్లిన తలసాని, సుధీర్ రెడ్డి**

చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈరోజు ములాఖత్‌లో కలిశారు. కేటీఆర్‌తో పాటు పార్టీ సీనియర్ నేతలు తలసాని శ్రీనివాస్ యాదవ్, సుధీర్ రెడ్డి కూడా బాల్క సుమన్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు. జైల్లో ఉన్న సుమన్‌కు పార్టీ పూర్తి అండగా ఉంటుందని ఈ సందర్భంగా కేటీఆర్ భరోసా ఇచ్చారు.

**అసలు కేసు నేపథ్యం ఏంటి?**

సింగరేణి కాలరీస్ ఆస్తులను ధ్వంసం చేయాలంటూ, రైలు పట్టాలు కోసేయాలంటూ బాల్క సుమన్ ఇటీవల రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో ఆయనపై నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ తర్వాత ఈ కేసును బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. గడిచిన మే 26న తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన బహిరంగ సభలో బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ.. సింగరేణి కాలరీస్‌కు చెందిన జూనియర్ అసిస్టెంట్ ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ అరెస్ట్ చర్యలు చేపట్టారు.

## పవన్ కల్యాణ్ భాష, తీరు సరిగా లేదు: గుత్తా సుఖేందర్ రెడ్డి

**తెలంగాణ ఆవిర్భావ వేడుకల వేళ పవన్ ఇక్కడ సభ పెడతాననడం సరికాదన్న గుత్తా**

**చంద్రబాబు, పవన్, మంత్రులు అమరావతిలో ఉండాని సూచన**

**తెలంగాణతో పోలిస్తే ఏపీకే ఎక్కువ వనరులు ఉన్నాయని వ్యాఖ్య**

తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ కూటమి నాయకులకు, ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు గట్టి కౌంటర్ ఇచ్చారు. మీడియా ప్రతినిధులతో జరిగిన చిట్‌చాట్‌లో ఆయన ఏపీ నాయకుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలు జరుగుతున్న ఈ కీలక సమయంలో.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇక్కడ సభలు నిర్వహిస్తామనడం ఎంతమాత్రం సరైనది కాదని గుత్తా సుఖేందర్ రెడ్డి స్పష్టం చేశారు. అంతేకాకుండా, ఇటీవల జరిగిన మీడియా సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడిన భాష, ఆయన తీరు అస్సలు బాలేదని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిపై కూడా గుత్తా సుఖేందర్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "అమరావతి బ్రహ్మాండమైన రాజధాని అని చెబుతున్న ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, అక్కడి మంత్రులు ముందు అమరావతిలోనే నివాసం ఉండాలి" అని సూచించారు. తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువ వనరులు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ఏపీకి సుదీర్ఘమైన సముద్ర తీరంతో పాటు, రకరకాల పోర్టులు కూడా ఉన్నాయని... కాబట్టి ఆ నాయకులంతా వారి రాష్ట్ర అభివృద్ధిని చూసుకోవాలి తప్ప, తెలంగాణ వైపు చూడాల్సిన అవసరం లేదని హితవు పలికారు. ఇక్కడ ఎలాంటి విద్వేషాలు సృష్టించడానికి ప్రయత్నించవద్దని హెచ్చరించారు.తెలంగాణ వ్యవసాయ రంగం, ధాన్యం కొనుగోళ్లపై గుత్తా సుఖేందర్ రెడ్డి పలు వివరాలను పంచుకున్నారు. తెలంగాణలో ఇప్పటికే 75 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లకు కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం సహకరించడం లేదని ఆరోపించారు. రైతులు సాంప్రదాయ పద్ధతుల్లోనే కాకుండా పంట మార్పిడి వైపు దృష్టి సారించాలని కోరారు.

# రాహుల్ "టచ్" పాలిటిక్స్ నాట్ టచ్చింగ్!

భారత జాతీయ రాజకీయాల్లో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శైలి ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన చర్చకు దారితీస్తూనే ఉంటుంది. ఇటీవల ఆయన చేస్తున్న కొన్ని వ్యాఖ్యలు, జోస్యాలు కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా.. ఏకంగా దేశంలోని అత్యున్నత రాజ్యాంగ, చట్టబద్ధమైన వ్యవస్థలను వివాదాల్లోకి లాగుతున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఉన్నతాధికారుల నుంచి మొదలుకొని న్యాయవ్యవస్థలోని కీలక వ్యక్తుల వరకు అంతా తనతో టచ్‌లో ఉన్నారని, ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం ఏడాదిలోనే కూలిపోతుందంటూ ఆయన చెబుతున్న మాటలు రాజకీయ వర్గాల్లో ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. దీనికి తోడు ప్రధాని మోదీ, అమిత్ షా దేశంలో మళ్లీ ఎమర్జెన్సీ విధించినా ఆశ్చర్యపోవాల్సిన పని లేదంటూ ఆయన చేస్తున్న ప్రచారంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**టచ్‌లో ఉంటే ఎవరైనా చెప్పుకుంటారా?**

ఏ ఒక్క బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేత కూడా దేశంలోని స్వతంత్ర వ్యవస్థల ప్రముఖులు న్యాయమూర్తులు, ఎన్నికల కమిషనర్లు తనతో రహస్యంగా 'టచ్' లో ఉన్నారని బహిరంగంగా చెప్పుకోరు. ఎందుకంటే, ఆయా వ్యవస్థల నిష్పాక్షికతను, గోప్యతను కాపాడటం ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకం. కానీ వారిపైనే రాజకీయం చేస్తున్నారు రాహుల్. ఎవరైనా టచ్‌లో ఉన్నా..చెప్పుకోరు. ఎందుకంటే తనకు సమాచారం ఇస్తున్న వారిని ఆయన జాగ్రత్తగా కాపాడుకుంటారు. కానీ ఇక్కడ రాహుల్



చెబుతున్నారంటే అర్థం ఎవరూ లేరని. ఆయా వ్యవస్థల్లోని ప్రముఖులపై ప్రస్తుత ప్రభుత్వానికి నమ్మకం కోల్పోయేలా చేయడమే రాహుల్ గాంధీ ప్రధాన వ్యూహం. ప్రభుత్వ పెద్దల్లో అంతర్గతంగా అనుమానాలు రేకెత్తించి, వ్యవస్థలను బలహీనపరచాలనే ఈ మైండ్ గేమ్ అంతిమంగా రాహుల్‌కే రివర్స్ అయ్యే ప్రమాదం ఉంది.

**వ్యవస్థలపై అపనమ్మకం కలిగించడమే రాహుల్ లక్ష్యం**

రాహుల్ గాంధీ అనుసరిస్తున్న ఈ సరికొత్త పంథా వెనుక ఒక నిర్దిష్టమైన సైకలాజికల్ వార్‌ఫేర్ కనిపిస్తోంది. నిరంతరం వ్యవస్థలపై నిఘా ఉందనే భ్రమను కల్పించడం ద్వారా, ప్రభుత్వ యంత్రాంగంలో ఒకరకమైన అభద్రతా భావాన్ని సృష్టించాలని కాంగ్రెస్ ఐటీ సెల్ , థింక్ ట్యాంక్ భావిస్తుండవచ్చు. అయితే, ఈ వ్యూహం క్షేత్రస్థాయిలో సామాన్య ఓటర్లకు తప్పుడు సంకేతాలను పంపుతోంది. దేశంలోని కోర్టులు, ఎన్నికల సంఘం వంటి పవిత్రమైన వ్యవస్థలు కూడా రాజకీయ పక్షాల చేతుల్లో కీలుబొమ్మలుగా మారుతున్నాయనే భావన ప్రజల్లో కలిగించడం వల్ల ప్రజాస్వామ్య పునాదులకే ముప్పు వాటిల్లుతుంది.

**దేశంలో అస్థిరత సృష్టించడం కోసమే ప్లాన్లు**

ఇక మోదీ-షా ద్వయంపై 'ఎమర్జెన్సీ' ఆరోపణలు చేయడం ద్వారా భయాందోళనలను రేకెత్తించి రాజకీయ మైలేజ్ పొందాలని చూడటం కూడా పాత పద్ధతిగానే కనిపిస్తోంది. గతంలో కాంగ్రెస్ హయాంలోనే దేశం అసలైన అత్యవసర పరిస్థితిని రుచి చూసిందనే చారిత్రక సత్యాన్ని ప్రజలు మర్చిపోలేదని బీజేపీ నేతలు కౌంటర్ ఇస్తున్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న రాహుల్ గాంధీ.. వ్యవస్థలను వివాదాల్లోకి నెట్టే ఇలాంటి చౌకబారు ప్రచారాలను నమ్ముకుంటే, ఆయన ఇంకా ప్రాథమిక రాజకీయ పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందనే భావన వ్యక్తమవుతోంది. కేవలం అపనమ్మకాలను సృష్టించడం ద్వారా కాకుండా, నిర్మాణాత్మకమైన విధానాలతో, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసినప్పుడే ప్రతిపక్ష నేతగా ఆయనకు జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు, గౌరవం లభిస్తాయనేది అందరి అభిప్రాయం.

# రేవంత్ పర్యటన విహారయాత్ర లాంటిది: శ్రీనివాస్ గౌడ్

**పాలమూరు-రంగారెడ్డి పథకంలో ప్రభుత్వ తీరుపై శ్రీనివాస్ గౌడ్ విమర్శలు**

**కేసీఆర్ హయాంలోనే 80 నుంచి 90 శాతం పనులు పూర్తయ్యాయని వెల్లడి**

**మిగిలిన పనులను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేస్తోందని విమర్శ**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలు పాదయాత్రకు సిద్ధమైనప్పుడే ప్రభుత్వానికి ప్రాజెక్టుల తనిఖీలు గుర్తొస్తున్నాయని, ఇందులో వారి చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలోనే ఈ ప్రాజెక్టుల పనులు 80 నుంచి 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యటన కేవలం పబ్లిసిటీ కోసం చేసిన 'హెలికాప్టర్ విహారయాత్ర' లాంటిదేనని విమర్శించారు. కొల్లాపూర్ ప్రాంతంలో హార్టికల్చర్, పాలిటెక్నిక్ కాలేజీల ఏర్పాటును పక్కనబెట్టారని, మామిడి రైతులకు న్యాయం చేయలేదని మండిపడ్డారు. అలాగే, బీఆర్ఎస్ నేత శ్రీధర్ రెడ్డి హత్య జరిగి రెండేళ్లవుతున్నా విచారణలో పురోగతి లేదని, సీఎం పర్యటనల వేళ ప్రతిపక్ష నేతలను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి పిక్నిక్ తరహా పర్యటనలు ఆపి, పాలమూరు అసలు సమస్యలపై, 'రామన్నగుట్ట రిజర్వాయర్' ప్రాజెక్టుపై స్పష్టమైన సమీక్ష నిర్వహించాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.



# రూపాయి కూడా తేలేదు

**కిషన్ రెడ్డి, బండి సంజయ్ లపై కడియం శ్రీహరి ఫైర్**

**తెలంగాణ కేంద్ర మంత్రుల వల్ల రాష్ట్రానికి ఉపయోగం లేదన్న శ్రీహరి**

**కాజీపేట రైల్వే డివిజన్ ను తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్**

**రేవంత్ పై కేటీఆర్ వాడుతున్న భాష సరికాదని వ్యాఖ్య**



కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తన క్యాంప్ ఆఫీస్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన ఆయన.. కేంద్ర మంత్రులు ఇద్దరూ తెలంగాణ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా అదనంగా తీసుకురాలేదని, వారి వల్ల రాష్ట్రానికి ఎలాంటి ఉపయోగం లేదంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల దశాబ్దాల కల అయిన 'కాజీపేట రైల్వే డివిజన్'ను తక్షణమే ఏర్పాటు చేయాలని శ్రీహరి కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. ఈ డివిజన్ ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతంలో పారిశ్రామిక వృద్ధి పెరగడమే కాకుండా, స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన స్పష్టం చేశారు. గత 12 ఏళ్లుగా బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణను ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేస్తోందని.. అసలు ప్రధాని మోదీకి, బీజేపీకి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఇష్టం లేదని ఆరోపించారు. కేంద్ర మంత్రులు కేవలం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని, బండి సంజయ్ చెబుతున్న రూ.13 లక్షల కోట్ల నిధుల్లో రాష్ట్రానికి వచ్చిన ప్రాజెక్టులు ఏవో శ్వేతపత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు.ఇదే సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీరును కూడా శ్రీహరి తప్పుపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ వాడుతున్న భాష ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. "ప్రజల చేత ఎన్నికైన ఒక ముఖ్యమంత్రిని 'తెలంగాణ ద్రోహి' అని పిలవడం కేటీఆర్ అహంకారానికి నిదర్శనం. అధికారం కోల్పోవడంతోనే ఆయన ఇలా మాట్లాడుతున్నారు. ఆయనకు నాయకత్వ లక్షణాలు లేవనే విషయాన్ని స్వయంగా ఆయన సోదరే (కవిత) గతంలో చెప్పిన విషయాన్ని గుర్తుంచుకోవాలి" అని వ్యాఖ్యానించారు.




## హైదరాబాద్‌లో ఎబోలా కలకలం

హైదరాబాద్: నగరంలోని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎబోలా వైరస్ అనుమానిత కేసు కలకలం రేపింది. ఎబోలా లక్షణాలతో సూడాన్ దేశస్తుడు.. హైదరాబాద్ గాంధీ ఆసుపత్రి ఐసోలేషన్ వార్డులో చేరాడు. శాంపిల్స్ సేకరించిన అధికారులు పుణే ల్యాబ్‌కు పంపించారు. టెస్ట్ రిజల్ట్ వారం రోజుల్లో వచ్చే అవకాశం ఉందని.. ఎబోలా అనుమానిత వ్యక్తికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆ ప్రయాణికుడిని ప్రత్యేక అంబులెన్స్‌లో హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించి ఐసోలేషన్ వార్డులో ఉంచారు. వైద్యులు అతని ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఆఫ్రికా ఖండంలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న ప్రాణాంతక 'ఎబోలా' వైరస్ విషయంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. సెంట్రల్ ఆఫ్రికాలో ఎబోలా వైరస్ మహమ్మారి విలయం సృష్టిస్తున్న నేపథ్యంలో, ప్రపంచ ఆరోగ్య సంస్థ దీనిని అంతర్జాతీయ ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో దేశీయంగా వైరస్ వ్యాప్తి చెందకుండా నిరోధించేందుకు ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు దేశంలోని అన్ని ప్రధాన అంతర్జాతీయ రవాణా కేంద్రాల వద్ద కఠినమైన నిఘా, స్క్రీనింగ్ చర్యలను చేపట్టాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది.ఎబోలా ప్రభావిత దేశాలైన డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, సౌత్ సూడాన్ నుండి వచ్చే ప్రయాణికులు తమ ప్రయాణ వివరాలను తప్పనిసరిగా వెల్లడించాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ ఇప్పటికే నిబంధనలను జారీ చేసింది. ఇటీవలే ఎబోలా వైరస్ పీడిత దేశాల నుంచి 28 మంది ప్రయాణికులు దేశంలోకి వచ్చినట్టుగా అధికారులు గుర్తించారు. దాంతో ఒక్కసారిగా అప్రమత్తమైన ఆరోగ్య యంత్రాంగం విమానాశ్రయంలో ప్రయాణికులను పరీక్షించడమే కాకుండా... ఒకవేళ వారు ఎబోలా విస్తరిస్తున్న ప్రాంతాల నుంచి వచ్చినట్టు గుర్తిస్తే... వెంటనే వారిని 21 రోజుల పాటు ఐసోలేషన్‌లో ఉంచి పరిశీలిస్తారు.

# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు తమ పంటలు వేసుకోవాలి

**పంట మార్పిడి పద్ధతులు అవలంబించాలి**

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**గ్రామ మహిళా సంఘ భవనం, జీవనోపాధి ఆర్థిక సాధికారిత కేంద్రాల ప్రారంభం**





**కుంటాల :** నిర్మల్ జిల్లా కుంటాల మండల కేంద్రంతో పాటు కొన్ని గ్రామాల్లో నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పర్యటనలో భాగంగా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు తమ పంటల సాగులో మార్పులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. గురువారం కుంటాల మండలం అంబగంటి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది ఆశించినంత స్థాయిలో వర్షపాతం ఉండకపోవచ్చని వాతావరణ శాఖ నివేదికలు సూచిస్తున్నందున రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని అన్నారు. పంట మార్పిడి పద్ధతులను అవలంబించి, తక్కువ నీటి అవసరమయ్యే కొత్త రకాల పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవసరమైన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం అందిస్తారని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించి అధిక లాభాలు పొందాలని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని వినియోగించుకొని డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, లైసెన్స్ పొందిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అవసరానికి మించి ఎరువులు వాడరాదని సూచించిన కలెక్టర్, జిల్లాలో రికార్డు స్థాయిలో మొక్కజొన్న కొనుగోలు జరిగిందని, రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలులో నిర్మల్ జిల్లా మూడో స్థానంలో నిలిచిందని తెలిపారు. రాబోయే వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను కూడా పాటించాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా చెత్త బండ్లలో వేయడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, ప్లాస్టిక్ వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. వర్షపు నీటిని వృథా కాకుండా ఒడిసిపట్టుకోవాలని, సోక్‌పిట్లు నిర్మించడం ద్వారా భవిష్యత్తు తరాలకు నీటి కొరత రాకుండా చూడాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, ఈ సంవత్సరం తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు కందులు, మినుములు, పెసర్లు, నువ్వులు, పొద్దుతిరుగుడు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు మంచి లాభాలు పొందుతున్నారని, ఇతర రైతులు కూడా ఆ దిశగా ముందుకు రావాలని అన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇద్దరు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు.




## జూన్ 6న జీలుగుమిల్లిలో మాల సంఘ సమావేశం

**ప్రతి గ్రామం నుంచి సభ్యులు తప్పక హాజరు కావాలని పిలుపు**

**జీలుగుమిల్లి జూన్04:** జీలుగుమిల్లి మండల కేంద్రంలో ఈ నెల 6వ తేదీ శనివారం సాయంత్రం 3 గంటలకు మాల సంఘ సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సంఘానికి సంబంధించిన కీలక అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి మాల సోదరులు విధిగా హాజరుకావాలని కోరారు. సంఘ అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నందున సమావేశానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశం అత్యంత ముఖ్యమైనదని, సభ్యులందరూ తప్పనిసరిగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఐక్యత, సంఘ బలోపేతానికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని నాయకులు తెలిపారు. అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో ఇంద్రేశం మున్సిపాలిటీలో వార్డుల సభలు

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం మున్సిపల్ అధికారులు ప్రజాప్రతినిధులు**

**వార్డుల అభివృద్ధిపై విస్తృత చర్చ..ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యచరణ**




**పటాన్చెరు జూన్ 4:** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం లోని ఇంద్రేశం మున్సిపాలిటీలోప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో 4, 5, 10, 11, 12, 13, 14 వార్డుల్లో వార్డుల సభలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ అజయ్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ హరీష్ రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, అధికారులు, గ్రామస్తులు హాజరయ్యారు. సభల్లో వార్డుల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల మెరుగుదలపై అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు విస్తృతంగా చర్చించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలు, సూచనలను నమోదు చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా అక్రమ ఓట్ల తొలగింపు ప్రక్రియపై అవగాహన కల్పించారు. అలాగే తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం అవసరమని వివరించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమల నివారణ చర్యలు, నీటి నిల్వలు లేకుండా చూడటం, వార్డుల పరిశుభ్రత వంటి అంశాలపై ప్రజలకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కమిషనర్, వైస్ చైర్మన్ హరీష్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు, పాలకవర్గ సభ్యులు, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## లక్ష్మీపతి గూడెంలో ఏర్పాటుచేసినప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభ

**17 వ వార్డ్ అభివృద్ధికి శ్రయ శక్తుల కృషి చేస్తాం**

**కౌన్సిలర్ కుమ్మరి కృష్ణ**




**గడ్డపోతారం:** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం లోని గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని లక్ష్మీపతిగూడెం-చౌదరిగూడెం వార్డు కార్యాలయంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రెండవ గ్రామసభను ఘనంగా నిర్వహించారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా అక్రమ ఓట్ల తొలగింపు, తడి చెత్త-పొడి చెత్త వేరు చేయడం, వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వార్డు పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే మహిళా భవనం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలపై చర్చించి, భవిష్యత్తులో గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్తామని కౌన్సిలర్ కుమ్మరి కృష్ణ, చైర్మన్ గద్దె సుష్మ గణేష్, వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్ తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వ్యవసాయ శాఖ అధికారి, వార్డు మున్సిపల్ మేనేజర్, డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## మంబాపూర్ గ్రామ సమస్యల పరిష్కారానికి అధికారుల దృష్టి సారించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ కు మెమోరండం సమర్పించిన గ్రామస్తులు**





**గుమ్మడిదల :** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపల్ మంబాపూర్ గ్రామానికి చెందిన ప్రజలు తమ గ్రామంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారం కోసం జిల్లా అధికారులను ఆశ్రయించారు. ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు భూముల పొజిషన్ చూపించడం, పల్లె ప్రకృతి వనం భూముల పరిరక్షణ, గ్రామానికి సెల్ టవర్ ఏర్పాటు వంటి అంశాలపై సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. మంబాపూర్ గ్రామానికి చెందిన 62 మంది లబ్ధిదారులకు సర్వే నంబర్-8లో ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరైనప్పటికీ, ఇప్పటి వరకు స్థలాల పొజిషన్ చూపలేదని గ్రామస్తులు జిల్లా అదనపు కలెక్టర్ సంగీతకు వినతి పత్రం అందజేశారు. సర్వే నంబర్-8 అటవీ భూమి అని చెబుతూ అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం రెవెన్యూ, అటవీ శాఖల సంయుక్త సర్వే నిర్వహించాలని కోరుతూ జిల్లా అటవీ శాఖ అధికారికి కూడా ప్రత్యేక వినతి పత్రం సమర్పించారు. అదే విధంగా గ్రామంలోని సర్వే నంబర్-34లో ఉన్న పల్లె ప్రకృతి వనం భూములను కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పర్యావరణ పరిరక్షణకు ఉద్దేశించిన ఈ భూములను రక్షించి అక్రమ ఆక్రమణలను అడ్డుకోవాలని కోరారు. మరోవైపు గ్రామంలో మొబైల్ నెట్‌వర్క్ సమస్య తీవ్రంగా ఉందని, అత్యవసర సమయాల్లో కూడా ఫోన్ సిగ్నల్ అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, సాధారణ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఏర్పాటు చేయాలని టెలికాం శాఖ అధికారులకు వినతి పత్రం సమర్పించిన, గ్రామ సమస్యలను ఎన్నో సంవత్సరాలుగా అధికారుల దృష్టికి తీసుకెళు న్నప్పటికీ పరిష్కారం లభించలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించడంతో పాటు పల్లె ప్రకృతి వనం భూములను రక్షించి, గ్రామానికి సెల్ టవర్ మంజూరు చేయాలని కోరారు.

## మహనీయుల విగ్రహాల ప్రతిష్ఠకు ఈ ఓ పంచాయతీ పాలకవర్గానికి మెమోరండం

**మహనీయుల విగ్రహాల ప్రతిష్టాపనకు సంపూర్ణ సహకార అందించాలి**

**దళితరత్న బొమ్మల మైసయ్య**

**రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు... మాలల హక్కుల సాధన సమితి**



**నార్సింగి, :** మెదక్ జిల్లా నార్సింగి గ్రామంలోకీర్తిశేలు కాక కీర్తిశేషులు గడ్డం వెంకటస్వామి , ప్రజా గాయకుడు గద్దర్ విగ్రహాల ప్రతిష్ఠకు అనుమతులు మంజూరు చేయాలని మాలల హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపకులు, దళిత రత్న అవార్డు గ్రహీత బొమ్మల మైసయ్య కోరారు. గురువారం గ్రామసభలో గ్రామపంచాయతీ పాలకవర్గానికి, ఈఓకు పాలకవర్గానికి, వినతిపత్రం అందజేశారు. మహనీయుల సేవలను గుర్తిస్తూ విగ్రహాల ఏర్పాటుకు కొత్త పాలకవర్గం సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎడ్ల వెంకట్, కందరి భూపాల్, బొమ్మల పెద్దస్వామి, గుర్రాల ఎల్లం తదితరులు పాల్గొన్నారు.



## ఆష్ట గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి

**గ్రామ ప్రణాళిక కార్యక్రమంలో ఎంపీవో శివకుమార్**

**ముధోల్ మండల :** నిర్మల్ జిల్లా ముధోల్ మండలం ఆష్ట గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల్లో జరిగిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు. అలాగే పాస్టిక్ నిర్మూలన పచ్చదనం పరిశుభ్రత మొక్కలు పెంచడం అభివృద్ధి పనుల పై చర్చించడం జరిగిందని ఆష్ట గ్రామ సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారి ఎంపీవో శివకుమార్ నూతనంగా బ్రాహ్మణ్ గావ్ క్లస్టర్ కు గ్రామ సభకు విచ్చేసిన అగ్రికల్చర్ ఏవో రమేష్, పంచాయతీ కార్యదర్శి గంగాధర్, అంగన్వాడీ టీచర్స్ దమయంతి, దేవిక, కొత్తూరు సుజాత, వాణి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్, ఉప సర్పంచ్ సురుగుల సావిత్ర కోటయ్య మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో అందరూ సహకరించి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దామని తెలియజేశారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో పాల్గొన్ననర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజు యాదవ్

**ప్రజా అభివృద్ధి ఏ ప్రధాన లక్ష్యం...మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్**

**శాంతి భద్రత ల పరిరక్షణలో ప్రజల పాత్ర కూడా కీలకం... ఎస్ ఐ రంజిత్ రెడ్డి**



**నర్సాపూర్ :** మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపల్ కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక -- 99 రోజుల వార్డు సభ, నర్సాపూర్ మున్సిపాలిటీ 1వ వార్డు హనుమంతపూర్‌లో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల వార్డు సభలో మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మీ రాజు యాదవ్ ,వార్డు కౌన్సిలర్, మున్సిపల్ కమిషనర్ సాయి కుమార్, ఎం ఈ ఓ తారా సింగ్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డు ప్రజల సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించి సూచనలు స్వీకరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక -- స్వచ్ఛ సర్వేక్షణ అవగాహన కార్యక్రమం5వ వార్డులో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ అవగాహన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మీ రాజు యాదవ్ పాల్గొని మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు మా లక్ష్యమని, గ్రామాల అభివృద్ధికి పరిశుభ్రత ప్రాముఖ్యత, పరిసరాల శుభ్రత ప్రజల భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక -- బడి బాట కార్యక్రమం నర్సాపూర్ రైతు వేదికలో నిర్వహించిన బడి బాట లో కూడా మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మీ రాజు యాదవ్, కౌన్సిలర్ సుధీర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ సాయి కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ రంజిత్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAl, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/